ప్రజాశక్తి
సోమవారం 15 డిసెంబరు 2025
5
అల్లూరి సీతారామరాజు



మహిళా సాధికారతకు కృషి

ప్రజాశక్తి, హుకుంపేట:స్త్రీ వివక్ష లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎపిఎం అప్పయ్యమ్మ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని స్థానిక మహిళ సమాఖ్య మండలి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన నవసేతన్ 40 జెండర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మహిళా సంఘాల సభ్యులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళ సాధికారతకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని అన్నారు. స్త్రీలకు అన్ని రంగాల్లో సమాన స్వేచ్ఛ, అవకాశాలు లభిస్తే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అదేవిధంగా 'మన డబ్బులు–మన లెక్కలు' కార్యక్రమాన్ని అమలు చేస్తున్న మహిళలకు పొదుపులు, రుణాలు, ఖాతాల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టి. నాగ వెంకటలక్ష్మి, మేరీ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎపిఎం



అసంపూర్తిగా ఉన్న పాఠశాల తరగతి గదులు

తరగతి గదుల కొరతతో అవస్థలు

▶▶ మధ్యలో నిలిచిన భవన నిర్మాణం
▶▶ వరండాల్లో క్లాసుల నిర్వహణ ▶▶ ఇదీ ఆదర్శ పాఠశాలలో దుస్థితి

ప్రజాశక్తి–చింతపల్లి :వందేళ్ల చరిత్ర కలిగిన చింతపల్లి ఆదర్శ పాఠశాలకు తరగతి గదుల కొరత వెంటాడుతోంది. తరగతి గదులు సరిపోక వరండాల్లో క్లాసులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

1927లో జైపూర్ మహారాజు ఆదేశాలతో జి.మాడుగుల మండలం పెద్దలోచలి నుంచి చింతపల్లి కేంద్రానికి మార్చి ఇక్కడ ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు సుమారు 232 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఏడుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా, డిప్యూటేషన్‌పై మరో ఉపాధ్యాయుడు పని చేస్తున్నారు. ఎంతో ఘన చరిత్ర, ఇంత మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలకు తరగతి గదుల సమస్య వెంటాడుతోంది. ప్రస్తుతం పాఠశాలలో మూడు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో రెండేసి తరగతులు ఒకే గదిలో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. నాణ్యమైన విద్యా బోధనకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. విద్యార్థుల్లో ఏకాగ్రత లోపిస్తుంది.



వరండాలో చదువుతున్న విద్యార్థులు

మధ్యలో నిలిచిపోయిన గదుల నిర్మాణం

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో గత వైసిపి ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం కింద రెండు తరగతి గదులను మంజూరు చేసింది. వీటి నిర్మాణం చేపట్టి ప్లాస్టింగ్ వరకు పనులు జరిగాయి. ఇంతలో ప్రభుత్వం మారడంతో తరగతి గదుల నిర్మాణం ఆగిపోయింది. ఇంకా ఫ్లోరింగ్, ఫిన్సింగ్ వర్కులతో పాటు కిటికీలు, తలుపులు వేయాల్సి ఉంది.



మరో వైపు తాగునీటి సమస్య వెంటాడుతోంది. ఎప్పుడో వేసిన బోరుబావి నీటినే తాగునీటికి ఉపయోగిస్తున్నారు. ఆర్ఒ ప్లాంట్ వంటి సౌకర్యం లేకపోవడంతో రక్షిత తాగునీరు అందని పరిస్థితి. ఈ పాఠశాలకు మహారాజు కాలంలో ఇచ్చిన ప్రాధాన్యం నేటి ప్రభుత్వాలు ఇవ్వడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారినా, పాఠశాల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినపిస్తున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పాఠశాలలో నిలిచిపోయిన పాఠశాల భవనాలను పూర్తి చేయాలని, ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేసి రక్షిత తాగునీరు అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

– ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి–డుంబ్రిగుడ:స్థానిక పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం పర్యాటకులు తరలి రావడంతో కిటలాడింది. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో సుమారు కిలోమీటరు మేర పర్యాటకుల వాహనాలు నిలిచి పోయాయి. పర్యాటకులు జలపాతంలో సరదాగా స్నానాలు చేసి, ఆదివాసి గిరిజన సంప్రదాయమైన వేషధారణ ధరించి ధింసా నృత్యాలు ప్రదర్శిస్తూ ఆనందంగా గడిపారు. జలపాతంలోని ఉద్యానవనంలో ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు. రోడ్డుకిరు వైపులనున్న వలిసే పూలతోటల్లో పోటోలు తీసుకుంటూ సరదా గడిపారు. చెట్టు నీడల్లో పర్యాటకులు వంటకాలు చేసుకుని వనభోజనాలు చేసి కుటుంబ సమేతంగా ఆటపాటలతో డ్యాన్స్‌లు చేస్తూ ఆనందంగా గడిపారు.

అరకులోయ:పర్యాటక కేంద్రమైన ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. వేల సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో అరకులోయ మన సందోహంతో కిక్కిరిసిపోయింది. దీంతో ఈ ప్రాంతంలోని సందర్శిత ప్రదేశాలు కిటకిట లాడాయి. పర్యాటకులు అధిక మొత్తంలో తరలి రావడంతో రహదారులు అడుగడుగునా ట్రాఫిక్ జామ్ ఏర్పడ్డాయి. దీంతో పర్యాటకులు కొంత ఇబ్బంది పడవలసిన పరిస్థితి ఏర్పడింది. అరకు –అనంతగిరి ఘాట్రోడ్లో ట్రాఫిక్ అధికంగా ఉండడంతో ప్రయాణీకులు అనుకున్న సమయానికి తమ గమ్యానికి చేరలేకపోయారు. కొన్నిచోట్ల పర్యాటకులు రోడ్ల పైన వాహనాలు నిలిపివేసి భోజనాలు చేశారు. గాలికొండ యు పాయింట్, కాపీ తోటల్లో అరకు విశాఖ ఘాట్ రోడ్ లో పర్యాటకులతో రద్దీ పెరిగి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడ్డాయి. గిరిజన సంస్కతిక మ్యూజియం, పద్మావతి ఉద్యానవన కేంద్రం, కాఫీ మ్యూజియం, ముఖద్వారాలు కిటకిట లాడాయి.



అరకులోయ మ్యూజియం వద్ద పర్యాటకులు



డుంబ్రిగుడలోని చాపరాయి వద్ద పర్యాటకులు

తాగునీటి సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి–కాశీపట్నం: అనంతగిరి మండలం తటవలస (కరణంగురువు) గ్రామంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని సీపిఎం నాయకులు కాకర సింగులు డిమాండ్ చేశారు. కాశీపట్నం పంచాయతీ తటవలస (కరణంగురువు) గ్రామంలో రెండేళ్లుగా తాగునీటి సమస్య ఉందని తెలిపారు. గ్రామాన్ని పర్యటించి గ్రామస్తులతో కలిసి మంచి నీరు తక్షణమే ఇవ్వాలని బిందెలతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తటవలస (కరణంగురువు) గ్రామంలో తాగునీరు లేక గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని అన్నారు.అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకుని మంచినీటి పైపు లైన్ మరమత్తులు చేయించి తాగునీరు సమస్యను పరిష్కారం చెయ్యాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసా కార్యదర్శి కోనేపు సన్నిబాబు, పీసా ఉపాధ్యక్షులు గరిడిపల్లి దేముడు, గ్రామస్తులు మిరియల జ్యోతి, మిరియాల రంభ, మిరియాల గంగ,కొర్రు కన్నమ్మ, గళవరి లక్ష్మణరావు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు



స్టాపర్ వద్ద అరకు సిఐ హిమగిరి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

– అరకు సిఐ హిమగిరి

ప్రజాశక్తి–అరకులోయ రూరల్: అరకు సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలనుసిఐ హిమగిరి చేపట్టారు. ఇందులో భాగంగా ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను స్వయంగా సందర్శించి,ప్రమాదాలకు ఆస్కారం ఉన్న చోట్ల స్టాపర్స్ ఏర్పాటు చేయించారు.పానరంగిని పెట్రోల్ బంకు సమీపంలో, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ దగ్గర, అల్లూరి రిసార్ట్స్ మెయిన్ రోడ్ వద్ద అలాగే బురద గెడ్డ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు స్టాపర్స్ ఏర్పాటు చేశామని సిఐ హిమగిరి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, వాహనదారులు ప్రయాణ సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అరకులోయ,అనంతగిరి,డుంబ్రిగూడ మండలాల పరిధిలో టూరిజం ప్రాంతం కావడంతో రద్దీ ఉంటడంతో ట్రాఫిక్ స్టాపర్స్ ఏర్పాట్లు చేసినట్లు సీఐ తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, టూరిస్టులకు ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండా టూరిజం ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

వంతెన కష్టాలు గట్టెక్కేనా..?

జూన్‌కు అన్నవరం వారధి పూర్తి కాకపోతే..మళ్లీ అవస్థలే..
40 గ్రామాల గిరిజనుల ఇబ్బందులు పట్టవా?

ప్రజాశక్తి– విఆర్‌పురం: చింతూరు, విఆర్‌పురం, ఉమ్మడివరం మధ్య వంతెన పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. ఇటీవల తాత్కాలిక డైవర్షన్ నిర్మించారు. అయితే శాశ్వతంగా వంతెన నిర్మించాలని, ఇప్పుడు మొదలుపెట్టకపోతే వచ్చే జూన్‌కి పూర్తి కాదని ఇప్పటికైనా వంతెన నిర్మించాలని పలువురు కోరుతున్నారు. సుమారు 40 గ్రామాల గిరిజన ప్రజలు ఈ వంతెనపై ఆధారపడి ఉన్నారు. నిధులు మంజూరైనపుడు కొత్త వంతెన ఎందుకు మొదలు పెట్టలేదని సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పుడు తాత్కాలికంగా నిర్మించిన డ్రైవర్షన్ వరద ఉధృతికి మళ్ళీ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. పది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చి నెల దాటుతున్నా ఇంతవరకూ పనులు ప్రారంభించలేదని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ అధికారులు దృష్టి సారించి అన్నవరం వాగుపై వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



అన్నవరం వాగుపై శిథిలావస్థకు చేరిన వంతెన

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు
టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.కృష్ణయ్య

ప్రజాశక్తి – చింతూరు : ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.కృష్ణయ్య అన్నారు. చింతూరు మండల యుటిఎఫ్ జనరల్ కౌన్సిల్ సమావేశం మండల కమిటీ అధ్యక్షులు ఎం.సోమరాజు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పి.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులపై బోధనేతర పనులను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌లో అధ్యయనం, సామాజిక ధృక్పథం కలిగి ఉండాలని ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విషయా లను తెలుసుకుంటూ ఫెడరేషన్ అభివద్ధికి పాటుపడాల న్నారు. యుటిఎఫ్ సంఘం బలోపేతానికి అందరి సహకారం అవసరమన్నారు. ఉపాధ్యాయ సమస్యలు వాటి పరిష్కారంపై పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సంఘం ద్వారా సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కృష్ణయ్య

నూతన మండల కమిటీ ఎన్నిక

అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం. సోమరాజు, ప్రధాన కార్యదర్శిగా బి. ముత్తయ్య 13మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతూరు- మారేడుమిల్లి ఘాట్ రోడ్డుపై ఆంక్షలు

ప్రజాశక్తి –చింతూరు: చింతూరు – మారేడుమిల్లి ఘాట్ రోడ్డు ప్రయాణంపై ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. రాత్రి వేళ ఘాట్ రోడ్డుపై ప్రయాణం చేయకుండా చింతూరు ఐటీడీఏపీవో ఆంక్షల ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాచలం నుంచి రాత్రి వేళ ఏపికి వెళ్లే వాహనదారులకు ఆంక్షలపై ప్రభుత్వం ఈ విజప్తి చేసింది. ప్రజా భద్రత కోసం ఆంక్షలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది. అల్లూరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఆంక్షలు విధించింది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ ప్రయాణంపై ఆంక్షలు ఉండనున్నాయి. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.

21న అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయండి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు

ప్రజాశక్తి –విఆర్‌పురం: మండలంలోని రేకపల్లిలో చింతూరులో 21న నిర్వహిస్తున్న అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు ఒక ప్రకటనలో కోరారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వ నిర్బంధాలు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, తునికాకుకు ధర స్థిరీకరణ కోసం సిపిఎం అనేక పోరాటాలు చేస్తే దానిలో మన అమరవీరులు నాయకత్వం వహించి ముఖ్య భూమిక పోషించారని కొనియాడారు. అనేక రాజకీయ నిర్బంధాలు ఎదుర్కొంటూనే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి విద్య వైద్యం, రోడ్లు, సాగునీటి కోసం ప్రభుత్వాలపై పోరాటాలు చేయబట్టే ఈ నాడు ఈ మాత్రం సాధించగలిగామన్నారు. అమర వీరుల స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామ్మూర్తి, సిరపు తాతబాబు , గుండు పూడి లక్ష్మణరావు, పీసా కమిటీ సభ్యులు సార పాండ్రాజ్, పీసా కార్యదర్శి వేటగాని సూరిబాబు, ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్. సుబ్బారావు పాల్గొన్నారు.

కూనవరం: ఈ నెల 21 న చింతూరులో జరిగే అమరవీరుల సమస్మరణ సభను జయప్రదం చేయాలని కూనవరం మండలం నుండి అధిక సంఖ్యలో సిపిఎం శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు పిలుపునిచ్చారు. టేకులబోర్‌లో ఉన్న అమరజీవి పాయం సీతక్క స్తూపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అమరవీరుల స్ఫూర్తితో ఈ ప్రాంతంలో ఉన్న ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలని సూచించారు. చింతూరులో జరిగే బహిరంగ సభకు సిపిఎం అఖిల భారత నాయకులు, ఆంధ్ర, తెలంగాణ హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు మడకం నాగమణి, పాయం సీతారామయ్య, తెల్లం తమ్మయ్య, తాలూరి శ్రీను, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న ఆరోగ్యభారతి సంస్థ నిర్వాహకులు

సిపిఆర్‌పై విద్యార్థులకు శిక్షణ

– ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో నిర్వహణ

ప్రజాశకి–చింతూరు : చింతూరులో కస్తూరిబా విద్యాలయంలో 9 10 వ తరగతి విద్యార్థులకు సిపిఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఆరోగ్యభారతి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రథమ చికిత్స, ఆరోగ్య జీవనవిధానం కార్డియాక్ అరెస్టు జరిగినప్పుడు చేయవలసిన అత్యవసర చికిత్స సీపీఆర్‌పై ఆదివారం శిక్షణ చేపట్టారు. కార్యక్రమంలో ఆరోగ్యభారతి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ పి.శ్రీనివాసరావు. జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ (రాజమండ్రి) డాక్టర్ ఏవియల్ నారాయణ, కార్యదర్శి, ఆరోగ్యభారతి(ఆంధ్ర ప్రదేశ్) దీనదయాల్ హాస్పిటల్ (నాగాయలంక) పాల్గొని అభ్యర్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కార్యక్రమం కల్పించారు. కార్యక్రమంలో చింతూరు సేవాభారతి వైద్యులు గంగాధరప్రసాద్ పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయరూ..!

ప్రజాశక్తి –సీలేరు: వద్ధులు, వితంతువులు, వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పింఛన్లు మంజూరు చేయాలని సీలేరు వైసిపి అధ్యక్షులు పేలూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ పూర్తి స్థాయిలో పింఛన్లు మంజూరు చేస్తామన్నారని, ఇప్పటి వరకూ కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. దీంతో అర్హులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేయాలన్నారు. వైసీపీ నాయకులు వెంకటరావు, స్వర్ణలత గణేష్ నూకరాజు బలరాం పాల్గొన్నారు.

నేవీ మారథాన్‌కు స్పందన

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : నేవీ డే వేడుకల్లో భాగంగా విశాఖ నగరంలో తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక 10వ వైజాగ్ నేవీ మారథాన్‌కు ఆదివారం విశేష స్పందన దక్కింది. ఆర్‌కె బీచ్‌లో సందడి వాతావరణం కనిపించింది. ఇతర దేశాల నుంచి కూడా రన్నర్లు హాజరయ్యారు. 17,500 మందికిపైగా ఈ మార థాన్‌లో పాల్గొన్నారు. ఫుల్ మారథాన్‌ను బీచ్ రోడ్డులోని విశ్వ ప్రియ ఫంక్షన్ హాల్ వద్ద తూర్పు నావికా దళ విభాగాధిపతి సంజయ్ భల్లా, హాఫ్ మారథాన్‌ను నేవీ వెల్ఫేర్ అండ్ వెల్నెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు, సిఎన్‌సి సతీమణి ప్రియా భల్లా, 10కె రన్‌ను విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, 5కె రన్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంబించారు. రోజువారీ పనులలో మానసిక ఒత్తిడికి గురవుతున్న ప్రజలను ఒత్తిడి నుంచి దూరం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు నేవీ ఉన్నతాధికారులు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సు సీజ్

ప్రజాశక్తి–చింతూరు: పరిమితికి మించి బస్సులో ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సును చింతూరు ఎస్సై రమేష్ శనివారం రాత్రి సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే ఒడిశా నుంచి కుంట మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని చట్టి జంక్షన్ నుండి విజయవాడ వెళుతుండగా చట్టి వద్ద ఎస్సై తనిఖీలు నిర్వహించారు. సంగీత ట్రావెల్స్‌కు చెందిన బస్సులో 110 మంది ప్రయాణికులు వెళ్తుండడం గమనించి బస్సును సీజ్ చేశారు. నిబంధనల ప్రకారం 35 మంది బస్సులో వెళ్లాల్సి ఉంది. అయితే ఈ బస్సులో సుమారు 110 మంది ప్రయాణిస్తున్నారు. అలాగే బస్సు (సిజి19యఫ్ 3366)లో డ్రైవర్లు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక డ్రైవర్ మాత్రమే డ్రైవ్ చేస్తున్నారు. ఇటీవల ట్రావెల్ బస్సులు ప్రమాదాలకు గురి కావటం జరుగుతోందని, అందువల్ల రాష్ట్రప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసిందని తెలిపారు. ఇటీవల మారేడుమిల్లి ఘాట్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో 9 మంది మృతి చెందిన సంగతి విధితమే. ఇటువంటి సంఘటనలు జరగకుండా మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో శనివారం నుండి రాత్రి పది గంటల నుండి ఉదయం 6 గంటల వరకు రాకపోకలు నిషేధించినట్లు చింతూరు సిఐ గోపాలకృష్ణ విలేకరులకు తెలిపారు. సంగీత ట్రావెల్ బస్సుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.




ర్యాలీ చేపడుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు

డ్రగ్స్, బాల్యవివాహాల అనర్థాలపై ర్యాలీ

దత్తత గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ సేవలు

ప్రజాశక్తి- చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. దత్తత గ్రామాలు చింతలమామిడి, చింతపల్లిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ, బాల్యవివాహాల నిరోధంపై అవగాహన సదస్సు, 'వికసిత భారత్ యంగ్ లీడర్' కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వి. ఈశ్వర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సేవా భావం, అంకితభావం పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యమన్నారు. ఇతరులకు సహాయం చేయడం, సమాజానికి తోడ్పడటంలో ఆహ్లాదమైన తృప్తి ఉంటుందన్నారు. ప్రోగ్రాం అధికారి పియుపి. సతీష్ మాట్లాడుతూ, దేశ సేవలో భాగస్వామ్యం కావడమే ఎన్ఎస్ఎస్ ధ్యేయమని, విద్యార్థులు సమాజ సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

సమస్యలపై దొన్నుదొరకు వినతి

ప్రజాశక్తి- కాశీపట్నం: తోటవలస, బసుపాడు, తీగలమడలో రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఏపీఎస్ఆర్టిసి రీజినల్ చైర్మన్, అరుకు వేలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సియ్యారి దొన్నుదొరకు టీడీపీ నాయకులు, కొత్తూరు పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి భీమవరపు గంగులు వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన దొన్నుదొర ప్రజల అవసరం తమ ప్రాధాన్యం అని, రోడ్డుని తప్పకుండా వేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మండల అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు, ముత్యాలమ్మ, సారా చందు, మజ్జి భీమరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- పెదబయలు: స్థానిక బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 1990–91 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పాతికేళ్ల తర్వాత కలుకుకున్న విద్యార్థులంతా చిన్ననాటి స్మృతులు గుర్తుచేసుకొన్నారు అనంతరం పూర్వ విద్యార్థి, తెలుగు సాహితి విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబరుస్తూప్రశంసపత్రాలు అందుకున్న పూర్వవిద్యార్థి డాక్టర్ జె.అచ్యుతరావును అలాగే అప్పటి ఉపాధ్యాయులు, ఉద్యోగులను సన్మానించారు అనంతరం పూర్వవిద్యార్థులంతా థింసా నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి మాధవరావు, ఎంపిటిసి కె బొంజుబాబు వైసిపి నాయకులు జి సూరయ్య , మాజీ సర్పంచ్ కె రణదేవ్, పీడీ సిహెచ్ లక్ష్మణ్, లువ్వాబు బాలన్న, ఆర్ఐ పి.కిరణ్, రొబ్బ చంద్రశేఖర్, రామన్న కిముడు, సిహెచ్ బాలకృష్ణ పాల్గొన్నారు.

మన్యాన్ని హడలెత్తిస్తున్న చలి

- వణుకుతున్న గిరిజనులు
- పొగమంచుతో ప్రమాదాలు

ప్రజాశక్తి-పాడేరు: చలిపులి మన్యాన్ని హడలెత్తిస్తోంది. చలి తీవ్రతతో మన్యం వాసులు వణుకుతున్నారు. ఇక్క నుంచి జనం బయటికి రాలేక పోతున్నారు. రోజు రోజుకి చలి తీవ్రత అధికం అవుతుంది. ఇప్పటివరకు అరుకులోయ ప్రాంతంలో 3 డిగ్రీల వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు దిగజారాయి. దట్టంగా కురుస్తున్న పొగ మంచుతో మన్యం లో జనజీవనం పూర్తిగా స్తంభించింది. దీనికి తోడు మంచు కారణంగా మన్యంలో రోజు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దట్టంగా కురుస్తున్న మంచుతో రోడ్డు సరిగా కనపడని కారణంగా కొత్తగా ఈ ప్రాంతానికి వస్తున్న పర్యాటకులతో పాటు స్థానికులు సైతం స్వల్ప ప్రమాదాలతో క్షతగాత్రులవుతున్నారు. ఈ వారంలోనే పాడేరు, అరుకు హైవేలో రెండు కారు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఒక విద్యార్థి మరణించారు. చలికి మన్యం ప్రజలు గజగజ వణుకుతున్నారు అనారోగ్య సమస్యల్ని కూడా ఈ చలి ప్రభావం తీవ్రతరం చేస్తోంది .గత పది రోజుల నుంచి చలి తీవ్రత రోజురోజుకూ అధికం అవుతూ వస్తోంది. ఈ చలి వాతావరణాన్ని ఆస్వాదించడానికి మన్యానికి తరలివస్తున్న పర్యాటకులు ఎటు చూసినా ఫైర్ క్యాంపు లతో సందడి చేస్తున్నారు. చలిని తట్టుకోవడానికి పర్యాటకులు ఈ ఫైర్ క్యాంపులో ఒక ప్రత్యామ్నాయంగా ఉన్నాయి. ఇక స్థానికులు కూడా చలిమంటలతోనే ఈ వణికించే చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ప్రస్తుతం పాడేరు ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు ఈ విధంగా నమోదు అవుతున్నాయి.

ఆదివారం పాడేరు డివిజన్లోని అరకులో 4.4 డిగ్రీలు, డుంబ్రిగూడలో 5.1, హుకుంపేటలో 7.3, జీమాడుగుల 5.5, ముంచంగిపుట్టు 6, చింతపల్లి 7.5, పాడేరు 8.6, పెదబయలులో 9 డిగ్రీలు చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాడేరు అరకు నియోజక వర్గంలో సింగల్ నంబర్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఇంకా రానున్న రోజులలో ఇంకా మరింత ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశాలు ఉన్నాయని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయలో చలిపులి వణికిస్తుంది. గత రోజులుగా చలి పంజా విసరడంతో గిరిజనులు గజగజ వణికి పోతున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది చలి తీవ్రత అధికంగా ఉండడంతో ఈ ప్రాంత వాసులు భయాందోళన చెందుతున్నారు. ఉష్ణోగ్రత 4 డిగ్రీలకు పడిపోవడంతో ఈ ప్రాంత వాసులు ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. అరకులోయకు వచ్చిన పర్యాటకులు కూడా చలి తీవ్రతను తట్టుకోలేక వెంటనే వెను తిరుగుతున్నారు. ఎక్కడ చూసినా చలి మంటలు దర్శనమిస్తున్నాయి. గ్రామాలలో కుంపటి వేసుకుని చలి కాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డిసెంబర్ నెలాఖరు వరకు ఇదే పరిస్థితి నెలకొంటుందని స్థానికులు భావిస్తున్నారు. మంచు అధికంగా కమ్ముకోవడంతో ఘాట్ రోడ్లో సాయంత్రం రాత్రివేళ ప్రయాణం నిషేధించిన విషయం తెలిసిందే. అరకు లోయలో ఉన్న దిన్నలకు గిరాకీ ఏర్పడింది.



అరకులోయలో చలి మంట కాగుతున్న పర్యాటకులు

నేరాలు ఘోరాలు



ప్రహరీని ఢీకొట్టి ఆగిన కారు

బైక్‌ను ఢీకొన్న కారు

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ పరిధిలోని పెదగరువు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనంపై గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల పెదగరువుకు వెళ్తున్న బోయిని రాజారావును అరుకు వెళ్తున్న టూరిస్టుల కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఢీ కొట్టిన సమయంలో ద్విచక్ర వాహనదారుడు కిందపడిపోగా, కారు అదుపుతప్పి పాఠశాల ప్రహరీ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో అనంతగిరి మండలం పైనంపాడు పంచాయతీ దుర్గం గ్రామానికి చెందిన బోయిని రాజారావు, కారులో ప్రయాణిస్తున్న సాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని బయటకు తీసి 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువతిని మోసగించిన యువకుడు అరెస్ట్

ప్రజాశక్తి-పాయకరావుపేట: మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన యువతినిప్రేమిస్తున్నానని వెంటపడి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన తొండంగి మండలం వేమవరం గ్రామానికి చెందిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు పాయకరావుపేట పోలీస్‌స్టేషన్‌లో సిఐ జి అప్పన్న తెలిపారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పాయకరావుపేట పోలీసులు శనివారం స్థానిక వై జంక్షన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకొని ఎలమంచిలి కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ అతనికి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడి నుంచి ఎంఫిల్డ్ బుల్లెట్ ను స్వాధీన పరుచుకున్నారు.

రహదారుల నిర్మాణాలకు కృషి

ఎమ్మెల్యే మత్స్యలింగం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ పరిధి కొండచీడిపుట్టు, బర్రెంగి బంధ గ్రామాలకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.5 కోట్ల 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న తారు రోడ్డు పనులను ఆదివారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, తడిగిరి సర్పంచ్ పెనుమల రంజిత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ, హుకుంపేట మండలంలోని మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించేందుకు తాము తీవ్రంగా కృషి చేశామని అన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు.

వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సర్పంచ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ కొండచీడిపుట్టు, బర్రెంగి బంధ గ్రామాలకు తారు రోడ్డు మంజూరు కావడంతో డోలి కష్టాలు త్వరలో తీరనున్నాయని తెలిపారు. టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు సిరిగం సూర్యకాంతం, బాకూరు సర్పంచ్ బాకూరు వెంకట రమణరాజు మాట్లాడుతూ డోలి కష్టాలు లేని గ్రామాలు తీర్చిదిద్దడానికి ప్రభుత్వం దేయంగా పనిచేస్తుందని వారన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వంతాల గాసన్న, సర్పంచ్ సత్యనారాయణ, శశి భూషణ్ నాయుడు, పాండు రంగస్వామి, రేగం రమేష్, సమీడ వెంకట పూర్ణిమ, తడిగిరి వైస్ సర్పంచ్ కిల్లో రామారావు, జనసేన నాయకులు వంతాల మోహన్, వైసీపీ అధ్యక్షుడు అనిల్, నాయకులు ముత్యంగి విశ్వేశ్వరరావు, సీపీఎం నాయకులు సోమన్న, కిల్లో వాసు, సీదరి చందు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కాశీపట్నం: మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు అంబోట్ మామిడి, కొత్తవలస, బల్యగుడ, రంజనివలస, కపాటివలస రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయిన సంగతి అందరికీ విదితమే. ఈ మేరకు గ్రామ పంచాయతీ సర్పంచ్,వార్డు మెంబర్లు,పంచాయతీ కార్యదర్శి చొరవ తీసుకొని రోడ్డు మరమ్మత్తు పనులను ప్రారంభించారు. జన్ని సింహాద్రి, ఎమ్‌జిఎన్‌ఆర్‌ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ గంగులు, గ్రామ యూత్ అప్పలస్వామి, కృపానందం, అప్పన్న, కృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న నేతలు



సీలేరు మెయిన్‌డ్యాం వద్ద పర్యాటకులు

ఏజెన్సీలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం సీలేరులో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో దారాలమ్మ ఆలయ సమీపంలో ఉన్న జలపాతాలు చూసేందుకు పలువురు తరలివచ్చారు. లంబసింగి పరిసర ప్రాంతాల్లో పల్బరి యాపిల్ చింతపల్లిగూడెం ప్రధాన రహదారికి ఇరువైపులా మిరియాలు, యాలకులు, లవంగాల పొదలు, కాఫీ తోటలు తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం సీలేరు జలవిద్యుత్ కేంద్రం ఇంటెక్ డ్యాం రెగ్యులేటరీ డ్యామ్ తిలకించారు.

పూర్వ విద్యార్థుల సందడి

సీలేరు ఎపి గురుకుల పాఠశాలలో 1983లో చదువుకున్న అప్పటి విద్యార్థులు ప్రస్తుతం వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. సీలేరులో అప్పటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకోవటనికి సీలేరు గురుకుల పాఠశాలను సందర్శించి ఎంతో అనుభూతిని పొందారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నాగబాబు

గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం

- జనసేన ఎమ్మెల్యేలతో నాగబాబు

ప్రజాశక్తి - లావేరు (శ్రీకాకుళం)

జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబును అన్నారు. శ్రీకాకుళం జిల్లా లావేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆదివారం నాగబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యేలతో ఆయన భేటీ అయ్యారు. క్రియాశీలక సభ్యత్వ నమోదును ఉద్యమంలా కొనసాగించాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జనసేన పార్టీ ఆశయాలు, ఉద్దేశాలు ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో జనసేన ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, లోకం నాగమాధవి, నిమ్మక జయకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పలువురికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : మహారాణిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మెగావైద్య శిబిరం నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు వైద్యశిబిరానికి హాజరయ్యారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సిఐ గొలగాని దివాకర్‌యాదవ్ అవసరమైన వారికి మందులతో పాటు స్నాక్స్ కూడా అందజేసి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా సిఐ దివాకర్ మీడియాతో మాట్లాడుతూ, ప్రజలకు వివిధ అంశాలపై తాము అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంటామని వాటితో పాటు మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. తొలిసారిగా చేసిన ప్రయత్నం విజయవంతమైందన్నారు.

కార్మికులకు నష్టం చేకూర్చే.. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

సంఘం అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణం రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో మొట్టమొదటిసారి జరుగుతున్న నేపథ్యంలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 4న విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి జరిగే మహా ప్రదర్శనకు కార్మిక కుటుంబాలను కదిలించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జగదాంబ వద్దగల సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత మహాసభ దగ్గర పడుతున్న నేపథ్యంలో మొత్తం నాయకత్వం, కార్యకర్తలు మహాసభల జయప్రదం కోసం కృషి చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలో శ్రామిక ఉత్సవాల పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ షో, పోరాటాలు, చరిత్రకు సంబంధించిన ఎగ్జిబిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. జిల్లాలో విస్తృతంగా ఫ్యాక్టరీల వద్ద, కార్మికుల పని ప్రదేశాల్లో, కాలనీల్లో ప్రచారం చేపట్టాలన్నారు. 35 సంవత్సరాలలోపు ఉన్న కార్యకర్తలను రెడ్‌షర్ట్ కవాతుకు సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 15న వాడవాడలా జెండాలు ఎగరవేయాలన్నారు. జిల్లాలో గ్రూపు మీటింగులు, జనరల్ బాడీలు ఏర్పాటు చేయాలన్నారు. స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమాలను ప్రజలకు వివరించాలన్నారు. లేబర్ కోడ్స్ ప్రమాదాన్ని కార్మికులకు తెలియజేయాలన్నారు. మహాసభలు విజయవంతం అయ్యే వరకు కార్యకర్తలు పట్టుదలగా కృషి చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్, బిహెచ్‌ఇఎల్, విశాఖ పోర్ట్, జివిఎంసి, ముఠా, బిల్డింగు, హాస్పిటల్, ఆశ, రక్షణ రంగం వంటి అనేక సంఘాల నాయకులు పాల్గొని మహాసభల విజయవంతం కోసం వారు చేసిన కృషిని వివరించారు.

ఆదాయార్జనపై విశాఖ పోర్టు దృష్టి

బెర్తుల ఆపరేషన్, నిర్వహణపై కసరత్తు

రూ.వెయ్యి కోట్ల ఒఅండ్‌ఎం పనులకు త్వరలో టెండర్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ పోర్టు అథారిటీ (విపిఎ) ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో క్రియాశీలంగా వ్యవహరిస్తోంది. ఒకవైపు వాణిజ్యంలో ప్రత్యామ్నాయ సరుకు రవాణాపై దృష్టిసారించి రికార్డులు నెలకొల్పుతున్న విపిఎ పోర్టు లోపల బెర్తులు, ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఒఅండ్‌ఎం)లో పలు చర్యలకు శ్రీకారం చుడుతోంది. సుమారు రూ.వెయ్యి కోట్ల మేర టెండర్లను త్వరలో ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. వెస్ట్ క్యూ – 1 అండ్ ఆర్ఇ బెర్త్, వెస్ట్ క్యూ 2, 4 ఈస్ట్ క్యూ – 4, ఇక్యూ –3లో హేండ్లింగ్ క్లీన్ కార్గో నిమిత్తం త్వరలో టెండర్లను పిలిచేందుకు పోర్టు అధికారులు సన్నాహాలు చేపట్టారు. పోర్టు ఆసుపత్రి వ్యవహారాన్ని కూడా ఒక కొలిక్కి తీసుకు వచ్చే దిశగా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీన్ని కూడా ఒఅండ్‌ఎంకు ఇస్తారా ? లేదా ? అన్నది చూడాల్సి ఉంది.

ప్రైవేటుకు పోర్టు ఆడిటోరియం నిర్వహణ

ఇప్పటికే పోర్టుకు సంబంధించిన కళావాణి ఆడిటోరియం నిర్వహణపై పోర్టు ట్రస్టు యాజమాన్యం కోర్టులో లీజుదారు కాశీవిశ్వనాథ్‌పై కేసు వేసి స్వాధీనానికి అన్ని చర్యలనూ తీసుకుంది. పోర్టు నిర్వహణలో పూర్తిగా ఇది కొనసాగేలా ఉన్నతాధికారులు త్వరలో బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం.


ఆడిటోరియంలోగల పలు స్థలాలను ప్రైవేట్ వ్యక్తి ఇష్టారాజ్యంగా వినియోగించడం, నిర్మాణాలు చేపట్టడం పట్ల పోర్టు ఉన్నతాధికారులు గుర్రుగా ఉన్నారు. పోర్టు ఆస్తులను కాపాడుకోవడం, నిర్వహణా భారంగా ఉండే బెర్తులను ప్రైవేట్ వారికి ఇవ్వడం, పలు అంశాల్లో పోర్టు అజమాయిషీ ఉండేలాగ టెండర్ల ప్రక్రియను త్వరలో చేపట్టడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రూ.వెయ్యి కోట్ల విలువైన ఒఅండ్‌ఎం బెర్తుల నిర్వహణకు చకచకా ఫైళ్లు కదులుతున్నాయి.

నేటి నుంచి ఎయులో అఖిల భారత డ్వాక్రాబజార్

కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: మహిళల స్వయం సాధికారతను సాధించేలా, ఆర్థిక బలోపేతాన్ని పెంచేలా, స్వయం ఉపాధిని ప్రోత్సహించే విధంగా 12 రోజుల పాటు నిర్వహించతలపెట్టిన సరస్ ఎగ్జిబిషన్ సోమవారం నుంచి ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ మీడియాకు తెలిపారు. ఈ ప్రదర్శన సోమవారం నుంచి ఈనెల 26 వరకూ ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతుందని, ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేశామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశమని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది ఎస్‌హెచ్‌జి. మహిళలు పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 250 స్టాళ్లలో హ్యాండ్లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్, చీరలు, షాల్స్, కార్పెట్లు,బెడ్ షీట్లు, వెదురు, లోహ,గాజు ఉత్పత్తులు, సంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, మసాలాలు, ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు అందుబాటులో ఉంటాయ న్నారు. అదనంగా ఫుడ్‌స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు,చిన్నారుల వినోద ఆటపరికరాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్. హెచ్.జి. మహిళలకు ఉచిత స్టాళ్లు, ఉచిత వసతి, భోజనం, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

డాక్టర్ డివిఎస్‌వై.శర్మకు అరుదైన గౌరవం



డివిఎస్‌వై.శర్మ

ప్రజాశక్తి -ఎంవిపికాలనీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లో పనిచేస్తున్న డాక్టర్ డి.వి.ఎస్.వై.శర్మకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రెండు ప్రతిష్టాత్మక బాధ్యతలు లభించాయి. ఈ నెల 24 నుంచి 30 వరకు ఇండోర్‌లో జరగనున్న అఖిల భారత అంతర్–సంస్థల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ లో ఆల్ ఇండియా ఎల్ఐసీ జట్టుకు మెంటార్‌గా ఆయన నామినేట్ అయ్యారు. అంతేకాకుండా 2026 జనవరి 1 నుంచి 11 వరకు గుజరాత్ వడోదరలో జరగనున్న ప్రపంచ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌కు ఆయన బ్లూబ్యాడ్జ్ ఇంటర్నేషనల్ అంపైర్‌గా ఎంపికయ్యారు. డాక్టర్ శర్మ ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గాను సేవలందిస్తున్నారు. ఆయన ఈ అరుదైన ఘనతలు సాధించిన సందర్భంగా ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్‌దాస్, యూనియన్ నాయకులు జి.వరప్రసాద్, ఎం.కామేశ్వరి, ఎల్ఐసీ ఉద్యోగులు ,విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా 'మిరియాల' జయంతి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ప్రజా సమస్యలు పరిష్కరించే ఉద్యమ నాయకుడిగా తనదైన రీతిలో చెరగని ముద్ర వేసుకున్న మిరియాల వెంకటరావు సమాజానికి అందించిన సేవలు అజరామరమని శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, వంశీకష్ణ శ్రీనివాస్ కొనియాడారు. ఆదివారం సిరిపురం వీఎంఆర్‌డిఎ బాలల ప్రాంగణంలో మిరియాల వెంకటరావు జయంతి వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ మిరియాల వెంకటరావు చివరివరకూ ఏదో ఒక కార్యక్రమం చేపట్టాలనే సంకల్పంతోనే మిరియాల ఫౌండేషన్ ఏర్పాటు చేసి ముందుకు సాగారన్నారు. అనేక యూనియన్లకు, సంఘాలకు ప్రాతినిధ్యం వహించి అందరికోసం పాటుపడేవార న్నారు. సమాజంతో పాటు కాపులకు ఎనలేని సేవలు అందించారన్నారు. ఎంతోమందికి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తమ్మిరెడ్డి శివశంకర్ (ఎపిఎంఎస్ఇ చైర్మన్), బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి మిరియాల వెంకటరావు పాటు పడ్డారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మిరియాల పౌండేషన్ ట్రస్ట్ సభ్యులు కఠారి అప్పారావు, మురళికోట పోతల శ్రీనివాస్ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, భీమిలి టిడిపి నాయకులు గంటా రవితేజ, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు ఉషశ్రీ, పివి సురేష్. డాక్‌యార్డ్ సంఘం అధ్యక్షులు బత్తుల చిరంజీవి, కార్యదర్శి విజనగిరి భాస్కరరావు, కాపుసంఘాల నాయకులు, గుంటూరు నరసింహ మూర్తి, తోట రాజీవ్, బిఎన్‌మూర్తి, సేనాపతి వెంకటేశ్, సుబ్బు విశ్వనాథ్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

600 మంది బాలికలకు కేన్సర్ నివారణ టీకాలు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: పోలీసులు, హోంగార్డుల కుటుంబాలకు చెందిన 9 నుండి 14 ఏళ్ల ఆడపిల్లలకు గత రెండు రోజులుగా పోలీస్ స్టేడియం ప్రక్కన టెంపుల్ అఫ్ లెర్నింగ్ ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న క్యాన్సర్ నియంత్రణ టీకా శిబిరం ఆదివారంతో ముగిసింది. నాట్కో ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ స్వచ్ఛందంగా శిబిరాన్ని నిర్వహించాయి. సుమారు 600 మందికి పైగా బాలికలు వ్యాక్సిన్ వేయించుకున్నారు. ఈ సందర్భంగా చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ కమిషనర్ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ కోరిక మేరకు 2 రోజులు శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 6 నెలల తరువాత తుది డోసు వేస్తామని చెప్పారు. గర్భాశయ ముఖ్యద్వార క్యాన్సర్ నివారణకు ఈ టీకాలు ఎంతగానో ఉపయోగపడతా యన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి రవిచంద్ర,సీరం ఇన్స్టిట్యూట్ మేనేజర్ రాంరతన్ పాల్గొన్నారు.